# రాచకొండ విశ్వనాథశాస్త్రి




కాశీనగరంలో గంగానదీ తీరాన, తెల్లటి ఇసక తిన్నెమీద కూర్చుని సాయంకాలపు సూర్యకిరణాల్తో తళ తళ లాడే అలలవైపు



చూస్తోన్న దేవదత్తుణ్ణి, వెనకనుంచి వచ్చి భుజంమీద గట్టిగా తట్టి పక్కన చతికిలపడ్డాడు చారుదత్తుడు.

ఇద్దరూ సమవయస్కులు. నడికాలం దాటి జుత్తు బాగా నెరిసింది. ముఖవర్చస్సు, దుస్తులు విలువా చూస్తే గౌరవ కుటుంబాలకి చెందినవాళ్ళలా కనిపిస్తున్నారు.

"ఏం చారుదత్తా! ఇంత ఆలస్యంగా వచ్చావేం? ఆందోళనగా కూడా వున్నట్టున్నావు?"

"ఇంకా వార్త వినలేదా ఏమిటి నువ్వు?" అని ఆశ్చర్యపడుతూ అడిగాడు చారుదత్తుడు.

"ఏ వార్త? నే నేం వినలేదు. యేమిటో చెప్పు త్వరగా."

"సుయోధన మహారాజు కూలిపోయాట్ట!"

"హర హరా! ఎప్పుడు!"

"కొద్ది దినాలే అయింది. వార్త ఇప్పుడే చేరింది."

"అంతా ఎలా జరిగింది? వివరాలేమిటి? యేమిటి కథ?"

"చివరికి ఆ భీముడే ప్రాణం పుచ్చుకున్నాట్ట."

"అయితే యుద్ధం ముగిసినట్టేనా?"

"ఆ! అధర్మంతో యుద్ధం ముగిసింది."

"అధర్మ యుద్ధం అంటున్నా వేమిటి?"



"గదా యుద్ధంలో రారాజుని జయించలేక చివరికి తొడలమీద కొట్టి చంపేట్ట భీమసేనుడు. అలా కొట్టమని పక్కనుండి ప్రోత్సహించాట్ట కృష్ణుడు."

"హరహరా! ఈ కృష్ణుడు చేయించే పాపాలకి హద్దున్నట్టు లేదు."

"అతగాడు సాక్షాత్తు శ్రీమహా విష్ణువు అవతారం. అతనేం చేసినా తప్పులేదని పాండవుల ప్రచారం."

"శ్రీమహా విష్ణువు, ఏదైనా అయుండొచ్చుగాని కొంపలు ముట్టించే కొరివి మాత్రం కాడు."

"కొంపలు ముట్టించే రాజకీయ వేత్తయుండబట్టే కథ ఇంతమట్టుకు వచ్చింది. ఈ కృష్ణుడు రాజకీయవేత్తే కాట్ట, గొప్ప వేదాంతి కూడానట."

"అహొకటా!"

"కాక, పాపం ఆ అర్జునుడు తొలిదినం నాకీ రాజ్యం వద్దు, రాళ్ళూ వద్దు, చూస్తూ చేతులారా వీళ్ళ నెవ్వర్నీ నేను చంపలేను అని అస్త్ర సన్యాసంచేసి కూర్చుంటే, ఈ నల్లవాడు మెట్ట వేదాంతం అంతా బోధపర్చి పురెక్కించి రెచ్చగొట్టేట్ట."

"ఆహాఁ! నాకీ విషయం ఇంతవరకూ తెలియలేదుస్మా. అయినా ఆ కిరీటికి విరక్తి పుట్టి ఉండొచ్చు. కాని, ఆ పెద్దవాడి రాజ్య కాంక్ష ఎక్కడికి పోతుంది చెప్పూ ?"

"ఆ కాంక్షే యింతా తెచ్చిపెట్టింది."

"చూశావా! ప్రాపంచిక సౌఖ్యాలకోసం తండ్రులు, కొడుకులు, అన్నదమ్ములు, బంధువులు, స్నేహితులు - సాధారణులు కూడా కారు, గొప్పవారు, పండితులు, జ్ఞానులు - అంతా ఒకర్నొకరెలా పొడుచుకు చంపుకున్నారో. వీరితోపాటు అమాయకప్రజానీకం ఎంత హతమయిందో!"

"దేవదత్తా! ఎటు చూసినా అధర్మం ప్రబలిపోతోంది. ఆర్యుల్లోనే ఈ అధర్మం పొడసూపినప్పుడు ఇంక అనార్యుల సంగతి చెప్పవలసిం దేముంది?" అన్నాడు చారుదత్తుడు విచారంతో.

"ధర్మ పద్ధతికి చరమకాలం వచ్చింది" అన్నాడు దేవదత్తుడు.

"ధర్మా ధర్మాల మాటేమిటి? నీకూ, నాకూ, అందరికీ, అన్నిటికీ, ఆర్యావర్తానికే కాదు, మహా ప్రపంచానికే అంత్యకాలం ఆసన్న మయినట్టుంది."

అంతవరకూ సూర్యకిరణాలు పడి మిల మిల మెరిసిన గంగాజలం కొన్నిచోట్ల ఎఱ్ఱబడింది: కొన్నిచోట్ల నల్లబడింది.

"హరహర మహాదేవ శంభో" అన్నరావం ప్రతివైపునుండీ విన వస్తోంది. చారుదత్త దేవదత్తులు లేచి విశ్వేశ్వరాలయంవైపు నడిచారు.

○ ○ ○

సాయం సమయం. సంఘారామంలో తటాకానికి దిగే చలువరాతి మెట్లమీద నిల్చున్నారిద్దరు బౌద్ధ సన్యాసులు. ఇద్దరూ వృద్ధులు. స్నానంచేసి తుడుచుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

"అంతే కాదు: నందా ఈ శంకరాచార్యుడు శివుడి అవతారమట అందరూ చెప్పుకుంటున్నారు" అన్నాడు ఉపాలి.



"ఈ బ్రాహ్మణులు మన తథాగతుడే విష్ణ్వంశ సంభూతుడన్నారు. ఆశ్చర్యమేముంది?" అన్నాడు ఆనందుడు.

"కాని, ఎవడీ శంకరుడు? ఎక్కణ్ణించి ఊడిపడ్డాడు?"

"మంట పట్టడం మళయాళ దేశంలో పుట్టింది, కాని తాత ముత్తాత లెవరో ఇక్కణ్ణించే తర్లి వెళ్ళారట అటువైపుకి. పూర్వాశ్రమంలో బ్రాహ్మణాధముడు."

"అలా చెప్పు. అయితే ఇంతకాలం తథాగతుడికి తలలొగ్గిన బ్రాహ్మణాధములు మంత్ర తంత్రాలతో తిరిగి తలలెత్తుతున్నారన్న మాట."

"ఎత్తుతున్నారని మెల్లిగా అంటున్నావా? ఎత్తి పడగ విప్పి ఆడు తున్నారు. వాళ్ళ నాయకుడే ఈ శంకరాచారి."

ఉపాలి కొంతసేపు మౌనంగా నిల్చొని, "జాడ్యం విపరీతంగా వ్యాపిస్తోందటకదా!" అని అడిగాడు.

"మనలో దోషాలు హెచ్చు పెరగడంచేతనే దానికి విరుగుడుగా ఇటువంటి జాడ్యం పుట్టుకొచ్చింది."

"మనలో దోషాలు వుంటే వుండవచ్చు. కాని ఈ శంకరాచారేకాని విజయుడయినట్లయితే ప్రజలు పూర్వంలాగే మాడి మసయిపోతారన్న మాట."

"నిజమే...."

"మనయొక్క- ఈ సంఘాలు, మనం, మన ధర్మపద్ధతి, మన

భిక్షువులు లేనినాడు ప్రపంచం అంతా చివరి దశకి వచ్చినట్టే" అని నిట్టూర్చాడు ఉపాలి.

○ ○ ○

తాజ్‌మహల్ సమీపాన్న సుందరోద్యానంలో పూలమొక్కల మధ్య పచ్చగడ్డిమీద కూర్చున్నారిద్దరు మహమ్మదీయులు. విలువైన వస్త్రాలు ధరించారు. వారి టోపీలూ, చేతి కర్రలూ పక్కన పడివున్నాయి. సాయంకాలపు నీరెండ తాజ్‌మహల్ అంచులకొక వింత శోభను తెచ్చిపెట్టింది. చల్లని గాలి వీస్తోంది.

"భాయీ, ఔరంగజేబు పాదుషా చనిపోయారని పుకార్ పుట్టింది విన్నావా?" అని అడిగాడు హుసేన్‌ఖాన్.

"పుకారు మాత్రం కాదు, నిజమే" అన్నాడు రహిమాన్.

"అరె! నిజమేనంటావా?"

"ఆహా! నిజమే."

"ఎవరు చెప్పారు నీకు?"

చెవిలో ఏదో మెల్లిగా ఊదాడు రహిమాన్.

"అల్లా, అల్లా! అయితే కబురు నిజమే అయుండాలి" అని వేదనతో అరిచాడు హుసేన్‌ఖాన్.

"మనం అల్లాని ప్రార్థించడం తప్ప మరింక చేసేదేం లేదు" అన్నాడు రహిమాన్.

"ఇహ రాజ్యానికి షాజాదాలంతా కొట్టుకు చస్తారు."



"అదెలాగా తప్పదు. అందులో ఎవరు నెగ్గినా ఒక్కటే. ఖాయీగా పరిపాలించే శక్తి ఎవడికీ లేదు."

హుసేన్‌ఖాన్ నిస్పృహతో అన్నాడు.

"అయితే కాఫర్లింక మనల్ని బతకనివ్వరు. దెక్కన్లో మరాఠీ దొంగలు ఇదివరకే చెలరేగేరు. ఇటు సిక్కులు కత్తులు నూరుతున్నారు. అంతవరకూ ఎందుకు? ఢిల్లీలోనే ద్రోహం చెయ్యడానికి కాఫర్లు సాహసిస్తున్నారట విన్నావా?"

"మన నీరసం చూసి ఏమైనా చేస్తారు. వేటగాడు లోకువైతే లేడి మూడు కాళ్ళమీద నడుస్తుందట!"

"ప్చ్! ఖరాబ్ రోజులొచ్చాయి భాయీ."

"మొగల్ సామ్రాజ్యానికే చెడ్డరోజులొచ్చాయంటే ప్రపంచ శాంతికే భంగం కలిగిందనుకో."

"కాదా మరి!!"

"ఒక కాఫర్లేకాదు. పైనుంచి ఇరానీలు, మంగోలీలు, ఇటు కాఫర్లు, మధ్య మనం. అంతా కలిసి తగవులాడి కొట్టుకొని నానా గోల్‌మాల్ జరుగుతుంది."

"మరొకటి. ఈమధ్య ఓడలమీద దిగుతున్నారు మాసేవా, తెల్లవాళ్ళు! వాళ్ళవైపెవడూ చూడ్డంలేదు. వాళ్ళమధ్య కొత్త కొత్త ఆయుధాలు తీసుకొచ్చి జాగ్రత్త చేస్తున్నారట."

"భాయీ! వీళ్ళూ వాళ్ళూ అనకు. నానా భీభత్సం జరుగుతుంది.

ప్రపంచంలో యింక శాంతి అనేది ఉండదు. మొగల్ సామ్రాజ్యానికి ఆఖ్రరోజు లొచ్చాయి."

"మొగల్ సామ్రాజ్యానికే ఆఖ్రరోజులొస్తే మహా ప్రపంచానికే ఆఖ్రరోజు లొచ్చాయని లెక్కవేసుకో" అన్నాడు హుసేన్ ఖాన్.

○ ○ ○

క్రీస్తుశకం, పంథొమ్మిది వందల నలభయ్యేడవ సంవత్సరం ఆగస్టు నెల పదిహేడవ తారీకు.

ఆంగ్లేయు లిద్దరు క్లబ్బు వరండాలో వాలుకుర్చీల్లో కూర్చొని చుట్టలు కాలుస్తూ మాట్లాడుకొంటున్నారు. బాగా చీకటిపడింది. చుట్టూ కలకత్తా నగరం కన్నుల పండువుగా స్వాతంత్ర్యోత్సవాన్ని జరుపుతోంది. దీపాల తోరణాలు ఎటు చూచినా కనిపిస్తున్నాయి. తారాజువ్వలు ఆకాశా న్నందుకొంటున్నాయి. ప్రతివైపునుంచీ జయజయ ధ్వనులు వినిపిస్తు న్నాయి.

"ఛార్లెస్! ఈనాడింత కోలాహలం చేస్తూన్న జనమంతా కొద్ది కాలంలో గోరీల్లోనూ, శ్మశానాల్లోనూ ఉంటారు, చూసుకో." అన్నాడు రిఛర్డు.

"బాగా చెప్పేవు" అన్నాడు ఛార్లెస్.

"పంజాబులో అప్పుడే అల్లర్లు బయల్దేరేయి, తెలుసా?"

"పంజాబ్ అన్నమాటేమిటి? దేశమంతటా బయల్దేరేయి."

"వీళ్ళుట పరిపాలన సాగించేవాళ్ళు!"

"ఇదంతా వినాశానికే వచ్చింది."



"అంతటికీ కారణం, మనదేశంలో చేతకాని గవర్నమెంటు రావడం."

"అదీ ఓ కారణం అయినా దీనిలో ఫేట్ పని చేస్తూందనుకో. ప్రపంచమంతా కుక్కల నక్కల పాలవుతుంది. మన సామ్రాజ్యం ఇలా నీళ్ళ కలిసి పోతోందా? అటు రష్యన్ భల్లూకం దొరికినవాళ్ళ నందర్నీ భక్షించేస్తోంది; దొరకని వాళ్ళకోసం చేతులు జాస్తోంది."

"ఇటు ఏటమ్ రహస్యం మనకైనా చెప్పకుండా అమెరికన్లు పట్టు క్కూర్చున్నారు."

"వాళ్ళెందుకు చెప్తారు? మనమీద మెరుగౌదామని వాళ్ళ చూస్తు న్నారు కదా!"

"వాళ్ళూ వీళ్ళూ మనంకూడా జర్మనీలో బైతాయించి రాళ్ళు రువ్వు కొంటున్నాం."

"మనమధ్య జర్మనీయేకాక యూరప్ అంతా నలిగిపోయింది."

"ఇటు ఆసియాలో ఇండియన్లతోసహా అంతా కొట్టుకుచస్తున్నారు."

"అంతా ఘోరంగా ఉంది."

"చూస్తూ వుంటే ప్రపంచానికి ఆఖరిదశ సమీపించినట్టుంది."

"బాగా చెప్పావు"

• • •

ప్రపంచం సాగుతూనే ఉంది, ఇన్ని వేల సంవత్సరాల నుంచీ, ఇన్ని యుగాలనుంచీ...

●